క్లుప్తంగా

అశోక్ శ్రీనివాస్‌కు ఘన నివాళి


అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రంగనాథరాజు

కామవరపుకోట: ఇటీవల మృతి చెందిన ఏలూరు జిల్లా కామవరపు కోట మండలం కళ్ళచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడ వరపు అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగ నాథరాజు కళ్ళచెరువు వెళ్లి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అశోక్ శ్రీని వాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ ప్రాంత ప్రజలు మంచి నాయకుడిని కోల్పోయారని, అశోక్ శ్రీనివాస్ మృతి వైఎ స్సార్‌సీపీకి తీరని లోటని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ


ఉమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాలరాజు, తదితరులు


బుట్టాయగూడెం: మండలంలోని సీతప్ప గూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీని యర్ నాయకులు కణితి ఉమామహేశ్వరరావు (ఉమా) ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దారు. ఉమా కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శిం చారు. అలాగే ఉమా చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కణితి ఉమా వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఎనలేని కృషి చేశార న్నారు. ఉమా మరణం పార్టీకి తీరని లోట న్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈవో

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తణుకు మండలం పైడిపర్రుకు చెందిన కొత్తపల్లి మురళీమోహన్ రావు ముందుగా కుటుంబ సభ్యులతో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో కొత్తపల్లి సూర్య విఘ్నేష్ పేరున జమ చేశారు. దాతకు ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రం అందించారు.

అధికార భాషగా గుర్తించాలి


సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులు

చింతలపూడి: ప్రపంచ వ్యాప్తంగా గిరిజన లంబాడీలు మాట్లాడే గోర్‌బోలీ భాషను అధికార భాషగా గుర్తించి, రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ఎస్టీ బంజారా లంబాడీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వర రావు నాయక్ డిమాండ్ చేశారు. ఎస్టీ బంజారా లంబాడీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ సమావేశంలో నాగేశ్వరరావు నాయక్ మాట్లా డుతూ లంబాడీలకు చట్ట సభల్లో, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. లంబాడీ తండాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని, యువతకు ఉపాధి కల్పించాలని జిల్లా అధ్య క్షులు గుగ్గులోతు కృష్ణా నాయక్ విజ్ఞప్తి చేశారు. అనంతరం నాగిరెడ్డిగూడెం గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ ప్రచారానికి ప్రజా స్పందన కరవు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రచారం చేసుకోవడానికి నిర్వహిస్తున్న మాది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఏలూరు నియోజకవర్గంలో నిస్తేజంగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం స్థానిక చోడిదిబ్బలో పర్యటించగా అక్కడి ప్రజల నుంచి పెద్దగా మద్దతు లభించలేదు. కరపత్రాల పంపిణీ అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తాము చేసిన అభివృద్ధి కంటే గత ప్రభుత్వంపై విమర్శలకే ప్రాధాన్యత ఇచ్చారు. దీనితో ప్రజలు ఇప్పటి వరకూ ఎమ్మెల్యే ఏమి అభివృద్ధి చేశా రో చెప్పలేదని గుసగుసలాడుకున్నారు. ఎమ్మె ల్యే ప్రసంగం ముగించి తమ పాలనపై ప్రజల నుంచి అభిప్రాయం చెప్పాలని స్థానికులను అడిగారు. అయితే ప్రజల నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.

జల్లేరుకు జలకళ

- నిండుకుండల్లా జలాశయాలు, చెరువులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

బుట్టాయగూడెం: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయంలోని భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో జలాశయం కళకళ లాడుతూ కనిపిస్తుంది. ఈ జలాశయం 217.08 మీటర్ల నీటి సామర్థ్యం కాగా, ప్రస్తుతం 217 మీటర్ల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే నీటి సామర్థ్యానికి మించి వర్షపు నీరు వచ్చి చేరుకోవడంతో ఇటీవల జల వనరుల శాఖ అధికారులు 300 క్యూసెక్కుల నీటిని గేట్లు ఎత్తి విడుదల చేశారు. పూర్తి స్థాయిలో నీరు ఉండటంతో ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ఎత్తైన కొండలు, పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేసిన జలాశయం ప్రస్తుతం ఎంతో అందంగా కనిపిస్తుంది. ఈ జలాశయం వెంబడి సుమారు 4,200 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న, వరి, చెరకు, పత్తి పంటలు వేశారు. జలాశయంలోకి భారీగా నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరులో అధికారులు జల్లేరు జలాశయం నుంచి ఆయకట్టు రైతులకు సాగు నీరందిస్తారు. అదే విధంగా చింతలగూడెం సమీపంలోని పోగొండ రిజర్వాయర్ కూడా కళకళలాడుతూ కనిపిస్తుంది. భారీగా వరద నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ జలాశయం వలన బుట్టాయగూడెం మండలంతో పాటు కొయ్యలగూడెం మండలంలోని రైతులు సుమారు 7,200 ఎకరాల్లో పంటలు పండిస్తారు. వరి, మొక్కజొన్న, ప్రత్తి పంటలకు నీటిని వినియోగించుకుంటున్నారు. అదే విధంగా రెడ్డిగూడెం సమీపంలోని కొవ్వాడ జలాశయంలో కూడా భారీగా వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం జలాశయం నీటితో కళకళలాడుతూ కనిపిస్తుంది. బుట్టాయగూడెం మండలంలోని కోడే కాలువ కూడా నీటి నిల్వతో కళకళలాడుతూ కనిపిస్తుంది. అదే విధంగా పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 2,37,265 హెక్టార్ల పంట భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఆలస్యంగా వర్షాలు కురిసినప్పటికీ పంటలకు సరిపడా వర్షం కురిసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా నియోజకవర్గంలో 242 పెద్ద చెరువులు, 850 చిన్న చెరువులు ఇటీవల కురిసిన వర్షాలతో నిండుకుండలా కనిపిస్తున్నాయి. నిండిన చెరువులతో ఆయా ప్రాంతాల్లోని రైతులు తమ పంటలకు సాగునీటి కొరత ఉండదంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నిండు కుండలా కనిపిస్తున్న జల్లేరు జలాశయం


పుష్కలంగా నీరు చేరిన పోగొండ రిజర్వాయర్

తుఫాన్ బాధితుల వివరాల సేకరణ

కొయ్యలగూడెం: తుఫాన్ నేపథ్యంలో కురిసిన అతిభారీ వర్షాలతో మండల వ్యాప్తంగా నష్టాలకు గురయిన ఇళ్ల వివరాలను సేకరిస్తున్నట్లు తహసీల్దార్ కె.చెల్లన్నదొర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఆరు చోట్ల ఇళ్లకి నష్టం వాటిల్లినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి సంబంధించి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నష్టాలకు సంబంధించిన పట్టికలు ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలు, నష్టాల వివరాలు ఇంకా నమోదు చేసుకోవాల్సిన వారు ఉంటే సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు. హౌస్ డేమేజ్‌లు కలిగిన వారికి బ్యాంకు ఖాతాలో నష్ట పరిహారం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రెండు రోజుల్లో జమ చేస్తామన్నారు.

రమణీయం.. ప్రకృతి సౌందర్యం


కొండలను తాకుతూ వెళుతున్న మేఘాలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో పాటు మేఘాలు దట్టంగా కమ్మడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. పచ్చని వాతావరణంతో పాటు కొండకోనలు చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం అలివేరు డ్యామ్ కాలనీ నుంచి అలివేరు, లంకపాకల వెళ్లే రహదారిలో కొండల్లో దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం వెళ్లే రహదారిలో గల కొండలపై మేఘాలు తెలుపు, నీలం రంగుల్లో అలరిస్తున్నాయి. ఆదివారం ఆ రోడ్డు మీద రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ సుందర దృశ్యాలు కనువిందు చేశాయి.

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా..!


కొయ్యలగూడెం: ఉత్సవ శిబిరంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు


ద్వారకాతిరుమల: గణేష్ ఊరేగింపులో చిత్ర విచిత్ర వేషధారణలు


జంగారెడ్డిగూడెం: ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

16 రోజులుగా నిత్య పూజలు

కొయ్యలగూడెం: ఓ బొజ్జ గణపయ్య వెళ్లి రావయ్యా అంటూ వినాయక చవితి ఉత్సవాలలో పూజలు అందుకున్న భారీ గణపయ్య విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 16 రోజులు నిత్య పూజలందుకున్న కో-ఆపరేటివ్ బ్యాంకు వీధిలోని గణనాథుడి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవకాళికా నృత్య ప్రదర్శనలు, కాంతారా వేషధారణలతో పాటు కళాకారులు వివిధ ప్రదర్శనలతో ప్రజలను ఆకట్టుకున్నారు. దీంతో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవ గణనాథుల ఊరేగింపు కార్యక్రమాలు పూర్తయ్యాయి.

జై బోలో గణేశా..

ద్వారకాతిరుమల: జై బోలో గణేష్ మహరాజ్‌కీ అనే నినాదాలు ద్వారకాతిరుమల క్షేత్ర పుర వీధుల్లో మార్మోగాయి. చిత్రవిచిత్ర వేషధారణలు, డీజే సౌండ్ల హోరు, డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాల నడుమ ఆదివారం వినాయక నిమజ్జనం ఎంతో ఉల్లాసంగా సాగింది. స్థానిక చెరువు వీధిలో గణేష్ ఉత్సవ కమిటీ వారు నెలకొల్పిన గణనాథుడి నిమజ్జనను కమిటీ సభ్యులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రవిచిత్ర వేషధారణలు, యువకులు, బాలలు చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే స్థానిక వసంత్‌నగర్ కాలనీలో నెలకొల్పిన గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం రెండు విగ్రహాలను పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువలో నిమజ్జనం చేశారు.

గంగమ్మ చెంతకు గణనాథుడు

జంగారెడ్డిగూడెం: భక్తులు గణనాథుడిని మేళతాళాలతో గంగమ్మ ఒడికి సాగనంపారు. 16 రోజులు పూజలందుకున్న గణనాథుడిని కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో నిమజ్జనానికి తరలించారు. ఆదివారం సాయంత్రం జంగారెడ్డిగూడెం బాల సుబ్రహ్మణ్యేశ్వర గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. తీన్‌మార్ డప్పులు, డీజే, బాణసంచా నడుమ వైభవంగా నిమజ్జనానికి తరలించారు.

రైతు సదస్సును జయప్రదం చేయండి


రైతులకు కరపత్రాలను అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న ద్వారకాతిరుమలలో నిర్వహించనున్న రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. మండలంలోని నారాయణపురం, గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రచార కరపత్రాలను రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం రైతులకు కరపత్రాలను పంపిణీ చేసి, రైతులు సదస్సులో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఈ రైతు సదస్సులో తీర్మానాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బోయపాటి సత్యనారాయణ, గుర్రం రాంబాబు, తూంపాటి మురళి, గుర్రం పాపారావు, ఎల్.సోమరాజు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి భారీగా భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రైవేట్ బస్సులు, మినీ వ్యాన్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువైన పాటెమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.


గుబ్బల మంగమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

కనకాద్రిపురం ఉత్పత్తులకు ప్రశంసలు

కొయ్యలగూడెం: ఢిల్లీలో నిర్వహిస్తున్న వరల్డ్ ఫుడ్ ఇండియా కార్యక్రమంలో ప్రదర్శించిన కనకాద్రిపురం చిరుధాన్యాల ఉత్పత్తులు అభినందనలు అందుకుంటున్నట్టు మదర్ థెరీసా మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు తోట కృపామణి తెలిపారు. తాము తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తుల స్టాల్‌ను ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఆహార శుద్ధి శాఖ మాత్యులు టి.భరత్ రాష్ట్ర స్టాల్స్ తిలకించి అభినందించినట్లు కృపామణి తెలిపారు. కనకాద్రిపురం ఉత్పత్తులు దేశ రాజధానిలో ఇతర దేశాలతో పాటు ప్రదర్శించారని, ఇతర దేశాల కార్పొరేట్ కంపెనీలతో పాటు మా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు అక్కడ ప్రదర్శించటం గర్వంగా ఉందన్నారు. ఇప్పటికే తాము తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కోసం ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ప్లాట్ ఫారంలో ఆన్‌లైన్ సదుపాయాన్ని జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ అందించామన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

టి.నరసాపురం: అంబేడ్కర్‌ను అవమానపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బొర్రంపాలెం అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బొర్రంపాలెంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని, అయనను అవమానించేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఘటనకు సంబంధించి కారణమైన 12 మందిపై ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. ప్రధాన రహదారిలో ఆందోళన చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆందోళన చేస్తున్న ప్రాంతానికి చేరుకున్న ఎస్సై ఎం.జయబాబు యువజన సంఘం నాయకులతో మాట్లాడి నిందితులపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


ఆందోళన చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

కోర్టులో దురుసుగా ప్రవర్తించిన నిందితుడు

ఏలూరు టౌన్: హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉంటూ కోర్టు వాయిదాకు వచ్చిన సందర్భంలో మద్యం తాగి వచ్చి న్యాయస్థానంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో కోర్టు ఉత్తర్వులు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో ఏలూరులో ఒక హత్య కేసులో నిందితుడిగా ఉన్న తూర్పు వీధికి చెందిన తిరుమల రామశివ (38) ఏలూరు జిల్లా కోర్టుకు కేసులో వాయిదాలకు వస్తున్నాడు. ఈ నెల 13న కోర్టు వాయిదాకు వచ్చిన రామశివ పూటుగా మద్యం తాగి కోర్టులో దురుసుగా ప్రవర్తించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవ

కామవరపుకోట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, భారత ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం, ఆడమిల్లిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరావు మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా నిర్వహిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, ఉమ పాల్గొన్నారు.


మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కామాక్షి పీఠంలో స్వచ్ఛతా హీ సేవ

కొయ్యలగూడెం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వెంకయ్యపాలెం రోడ్డులోని కంచి కామాక్షి పీఠంలో కాత్యాయిని పీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దార్ల రాంబాబు, ప్రధాన కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

జంగారెడ్డిగూడెం: ప్రమాదమని తెలిసినా, వాహనంపైన కూర్చొని ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం ఈ దృశ్యం కనిపించింది. పట్టణంలోని మెయిన్ రోడ్డుపై కొబ్బరి బొండాల లోడ్‌తో వ్యాన్ వెళుతోంది. ఈ లోడ్ పైన కూలీలు కూర్చొని ప్రయాణిస్తున్నారు. ఇటీవలే తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం వద్ద జీడిగింజల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడి, లారీపై ప్రయాణిస్తున్న కూలీలు మృత్యువాత పడిన విషయం విదితమే. అయినప్పటికీ ప్రమాదాల స్వారీ చేస్తూనే ఉన్నారు.


కొబ్బరి బొండాల లోడు వ్యాన్‌పై కూర్చొని ప్రయాణిస్తున్న దృశ్యం

అదృశ్యం కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ టీచర్ కనిపించకపోవటంతో భర్త ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసం ఉంటున్న నిమ్మగడ్డ నాగేశ్వరరావు లింగపాలెం మండలం నడిపల్లిలో పాస్టర్‌గా పని చేస్తున్నారు. అతని భార్య బాల స్వాతి (38) రెండు రోజుల నుంచి కనిపించకపోవటంతో ఆమె భర్త బంధువులు, తెలిసిన వారిని వాకబు చేసి, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.